క్లుప్తంగా

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి



కంకిపాడు: వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండల పరిషత్ సర్వ సభ్య సాధారణ సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తాగు నీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు. అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.అనూష, తహసీల్దార్ ఎం.రామకృష్ణ, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సాగుతున్న ‘పది’ పరీక్షలు

గన్నవరం: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని ఎంఈఓ కే రవికుమార్ తెలిపారు. మండలంలోని ఎనిమిది పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం జరిగిన గణితం పరీక్షకు 148 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు. మొత్తం 1,394 మంది విద్యార్థులకు గానూ 1,246 మంది మాత్రమే హాజరైనట్లు తెలిపారు. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఏప్రిల్ ఆరు నుంచి 18వ తేదీ వరకు ఎస్ఏ-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలకు సంబంధించిన టైమ్ టేబుల్‌ను అన్ని పాఠశాలలకు పంపినట్లు తెలిపారు. ఈ పరీక్షలను కూడా సమర్థవంతంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓ సూచించారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం ఆలయ అర్చకుడు జీఆర్‌వీ సాగర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్రయోదశి సందర్భంగా ప్రదోష కాలంలో శ్రీ మహానందీశ్వరస్వామికి అభిషేకం చేశారు. తొలుత నందీశ్వరుడికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. శ్రీరామలింగేశ్వర స్వామివారి ట్రస్టు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నున్న నుంచి గుణదలకు పాదయాత్ర

నున్న(విజయవాడరూరల్): ఏసుక్రీస్తు ప్రభువు శిలువ శ్రమలను ధ్యానిస్తూ శుక్రవారం నున్న గ్రామం ఆర్‌సీఎం చర్చి నుంచి గుణదలలోని మేరీమాత పుణ్యక్షేత్రం వరకు కాలి నడకన తపస్కాల పశ్చాతాప పాదయాత్ర జరిగింది. పాదయాత్రలో 800 మంది విశ్వాసులు క్రీస్తు శ్రమలను ధ్యానించడం చేశారు. నున్న విచారణ గురువు ఫాదర్ రెవరెండ్ జోషి, సహాయక గురువు ఫాదర్ జీవన్, సెయింట్ ఆన్స్ సిస్టర్స్, మదర్ థెరిస్సా అమ్మ బ్రదర్స్ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన దేవస్థానం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని ప్రసిద్ధ శ్రీకాశీవిశ్వేశ్వర స్వామివార్ల దేవస్థానం శనివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాలకు సిద్ధం అయ్యింది. ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని భక్తుల సహకారంతో శైవాగమం అనుసరించి త్రయాహ్నిక దీక్షతో వార్షిక మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ మామిళ్లపల్లి ఫణీకుమార్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని విజ్ఞప్తి చేశారు.

27న కోదండ రామాలయ ధ్వజస్తంభం ప్రతిష్ట

ఉంగుటూరు: తేలప్రోలు పార్సన్‌పేటలో కోదండ రామాలయ జీర్ణోద్ధరణ, నూతన ఆలయ విగ్రహ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం తెలిపింది. తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి బ్రహ్మశ్రీ తంగిరాల వెంకటకృష్ణ పూర్ణప్రసాద్ నేతృత్వంలో ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు. మధ్యాహ్నం గోవృషభ కల్యాణం, అంబోతును అచ్చుపోయుట, సాయంత్రం ఐదు గంటలకు సీతారాముల కల్యాణం, పుష్పయాగం జరుగుతాయని చెప్పారు.

పేదలు, పెత్తందార్లకు మధ్య యుద్ధానికి సిద్ధం

- రానున్న ఎన్నికలు అవే
- పేదలకు అండగా జగనన్న
- పెత్తందార్లకు వత్తాసు చంద్రబాబు
- వైఎస్సార్ సీపీకి పట్టాభిషేకం ఖాయం
- మంత్రి జోగి రమేష్


ఇంటింటి ప్రచారంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి జోగి రమేష్

కంకిపాడు: రానున్న ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగే యుద్ధమని, ఈ యుద్ధానికి ప్రజలు సన్నద్ధం కావాలని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు నియోజకవర్గ అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. కంకిపాడు పట్టణంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టా రు. పట్టణంలోని అంకమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల్ని ఆత్మీయంగా పలకరించి ప్రజా సమస్యలు అడిగి తె లుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇస్తూ.. ఫ్యాన్ గుర్తుకు ఓట్లువేసి వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందించాలని అభ్యర్థించారు. సంక్షేమం, అభివృద్ధి అందిస్తోన్న జగనన్న ను మళ్లీ సీఎం చేయాలని పిలుపునిచ్చారు.

ఎవరొచ్చినా.. యుద్ధానికి సిద్ధం..

పెనమలూరు నియోజకవర్గ బాధ్యతలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు నెలల క్రితమే తనకు ఇచ్చారని మంత్రి జోగి రమేష్ అన్నారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు పోటీకి వస్తున్నాడని, ఎవరెవరో పోటీ చేసే అవకాశం ఉందని ఐవీఆర్ఎస్ సర్వేలు కూడా చేసుకుని చివరికి బోడె ప్రసాద్‌కు అవకాశం ఇచ్చారని ఎద్దేవా చేశారు. తన మీద పోటీకి ఎవరొచ్చినా తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 25 వేల పై చిలుకు ఓట్ల మెజారిటీతో గెలవబోతున్నానని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటీ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే సొంతమన్నారు. ఓటు వేశారా? అని చూడకుండా అర్హత ఉందా? లేదా? అన్నదే చూసి పథకాలను అందించిన ఘనత వైఎస్సార్ సీపీదేనని అన్నారు. సంక్షేమానికి పట్టం కట్టిన ప్రభుత్వానికి 175కి 175 స్థానాలు ఎందుకు సాధ్యం కాదని అన్నారు. ప్రజల మదిలో ప్రభుత్వ సంక్షేమ పాలన, జగనన్న గుర్తుండిపోయారని స్పష్టం చేశారు.

చంద్రబాబు, లోకేష్, పవన్‌కు ఓటమి తప్పదు..

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి రాష్ట్రంలో ఎదురుదెబ్బ తప్పదని మంత్రి జోగి రమేష్ అన్నారు. కుప్పంలో చంద్రబాబు, మంగళగిరిలో లోకేష్, పిఠాపురంలో పవన్‌కల్యాణ్ ఓటమి ఖాయమన్నారు. ప్రతిపక్ష కూటమి పునాదులు పెకలిపోయే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై బురద చల్లుతున్న ప్రతిపక్ష కూటమికి ప్రజలు తమ ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, నియోజకవర్గ పరిశీలకుడు రామసుధీర్, ఏఎంసీ వైస్‌చైర్మన్ మాదు వసంతరావు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, సర్పంచ్ బాకీ రమణ, సగర, టిడ్కో, ఉమెన్‌ఫైనాన్స్, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్లు నక్కా శ్రీనివాసరావు, పి.రాఘవరావు, నందిపాటి బిందుమాధవి, రామినేని రమాదేవి, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, సీహెచ్‌సీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, ఎంపీటీసీ సభ్యులు కోనా కృష్ణకిషోర్, చిట్టూరి ప్రసాద్, తోకల ఉమాదేవి, బూరగ బాలాజీ, షేక్ అమీనాబీ, బేతపూడి సురేష్, వదుగు శ్రీనివాసరావు, సర్పంచ్‌లు చిప్పల రామదాసు, బి.శివనాగిరెడ్డి, సీహెచ్ ఆదర్శకుమార్, మేరుగు విజయచంద్రశేఖర్, నాయకులు తంబాబత్తుల ఓంకారం, మలబంటి దుర్గాప్రసాద్, తాడేపల్లి సతీష్‌కుమార్, పిడికిటి రామకోటేశ్వరరావు, బిళ్లా వెంకటేశ్వరరావు, బీహెచ్ నాగిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, నర్రా రమేష్, గుజ్జుల కోటేశ్వరరావు, జె.నాగేశ్వరరావు, నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ చిన్నా పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం


విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రంగన్నగూడెంలో ప్రపంచ జల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు అధ్యక్షతన సదస్సు జరిగింది. సదస్సులో గోపాలకృష్ణారావు మాట్లాడుతూ జలవనరుల ప్రాముఖ్యతను వివరించారు. నీటి వనరులు అదృశ్యమైతే సకల జీవరాశుల మనుగడకు ముప్పు వాటిల్లుతుందని చెప్పారు. నీటి కాలుష్యం, వృథాపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం పోలవరం కుడి కాలువ జలవనరుల శాఖ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజినీర్ సీహెచ్ రామకృష్ణను దుశ్శాలువ, పుష్ప గుచ్ఛాలతో గ్రామస్తులు సత్కరించారు. సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యుడు పుసులూరి లక్ష్మీనారాయణ, ఎంపీయూపీ స్కూల్ హెచ్‌ఎం ఆర్.గ్లోరీస్వర్ణలత పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: నీటిని రక్షించుకోవాలని వీరపనేని గూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి అన్నారు. వరల్డ్ వాటర్ డే సందర్భంగా శుక్రవారం నీటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులతో నీటిని రక్షించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను బకాయి వెంటనే చెల్లించాలి


కానూరు సచివాలయం-4ను తనిఖీ చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ కానూరు సచివాలయం-4లో ఆస్తి పన్ను బకాయి ఎక్కువగా ఉందని, సచివాలయ సిబ్బంది పన్ను బకాయి వసూళ్లు చేయాలని మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. కానూరు సచివాలయం-4ను శుక్రవారం కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం-4లో ఆస్తి పన్ను బకాయి రూ. 44,08,373 ఉందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున సచివాలయ సిబ్బంది టీమ్‌గా ఏర్పడి ప్రభుత్వం ఆస్తి పన్నుపై ఇచ్చిన వడ్డీ రాయితీపై అవగాహన కల్పించాలని సూచించారు. బకాయి ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ జరుగుతుందన్నారు. మొండి బకాయిలు ఉంటే రెడ్ నోటీసులు జారీ చేసి ఈ నెల 31వ తేది నాటికి పన్నులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల స్వచ్ఛ భారత్



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

పెనమలూరు: తాడిగడప గ్రామంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు శుక్రవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చెరువు కట్టపై ఉన్న పిచ్చి మొక్కలు తొలగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి మున్సిపాలిటీ వాహనంలో తరలించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి చెత్తను వీధుల్లో ఉన్న చెత్తకుండీలో మాత్రమే వేయాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. తడి, పొడి చెత్త వేరుగా వేయడం వల్ల వర్మీ కంపోస్ట్ సంపద తయారు చేయవచ్చని తెలిపారు. అలాగే ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలి


నున్నలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీరమ్య

నున్న(విజయవాడరూరల్): ఎన్నికల నియమావళికి లోబడి అందరూ విధులను నిర్వర్తించాలని ఎంపీడీఓ, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరమ్య అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం నున్న, పాతపాడు, పి.నైనవరం గ్రామాల్లో పలు ప్రాంతాలను ఎంపీడీఓ శ్రీరమ్య, ఈఓఆర్డీ బీఎల్‌వీ శేషగిరిరావు పర్యవేక్షించారు. అనంతరం నున్న గ్రామ సచివాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల లోపు రాజకీయ పార్టీల కార్యాలయాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, గోడపత్రికలు లేకుండా చూడాలన్నారు. ఎన్నికల నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని పేర్కొన్నారు. సమావేశంలో సచివాలయాల కార్యదర్శులు జీ రమణ, వరుణ్, అజేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ శ్రీరమ్య సచివాలయ, పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజకీయ పార్టీల జెండా దిమ్మెలకు వైట్ వాష్ వేయాలని, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వీఆర్వో పవన్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం

గన్నవరం రూరల్: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అఖండ విజయం చేకూర్చేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పిలుపునిచ్చారు. కొత్తగూడెం గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో నాయకులతో కలిసి ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని పేర్కొన్నారు. ఇదే సంక్షేమం భవిష్యత్‌లో కూడా కొనసాగించేందుకు వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. నియోజకవర్గ ఎలక్షన్ ఇన్‌ఛార్జి రామిశెట్టి వెంకటేశ్వరరావు, సర్పంచ్ తూంపాటి రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, మండల జేసీఎస్ కన్వీనర్ కైలే శివకుమార్, సూరెడ్డి మణిమ్మ, అంగడాల సాంబశివరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు చర్యలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో సురక్షిత తాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ కార్యదర్శి జి.రామ్మోహనరావు తెలిపారు. గ్రామంలోని పలు ఓవర్ హెడ్ ట్యాంకులను శుక్రవారం ఆయన శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రధాన గ్రామం, కాల్వగట్టు ప్రాంతాల్లో కలిపి మొత్తం నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులు, వాటర్ పైప్‌లైన్ విస్తరణతో తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జలజీవన్ మిషన్ ద్వారా సుమారు రూ. నాలుగు కోట్లతో గ్రామంలో సురక్షిత తాగునీటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధాన గ్రామంలో రెండు, కాల్వగట్టు ప్రాంతంలో మరో రెండు వాటర్ ట్యాంకులను నిర్మాణం చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే గ్రామం మొత్తం పైప్‌లైన్ విస్తరణ పనులు నిర్వహిస్తామని వివరించారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థినికి అస్వస్థత

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విలేజి కండ్రికకు చెందిన విద్యార్థిని బడుగు వర్షిణి ఆయాసంతో ఊపిరి ఆడక అస్వస్థతకు గురైంది. చీఫ్ సూపరింటెండెంట్ రవిప్రసాద్ వెంటనే సమీపంలోని విలేజి హెల్త్ క్లినిక్‌కు సమాచారం ఇచ్చారు. ఏఎన్‌ఎం లక్ష్మీ పరీక్ష కేంద్రానికి వచ్చి విద్యార్థినికి గ్యాస్ టాబ్లెట్‌ను వేశారు. అనంతరం గ్రామంలోని 108 కేంద్రం సిబ్బంది వచ్చి విద్యార్థిని వ్యానులో ఎక్కించి ప్రాథమిక వైద్యం అందించారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న ఆ విద్యార్థిని యథావిధిగా పరీక్ష రాసింది. అనంతరం నందిగామ, తిరువురూ డెప్యూటీ విద్యాశాఖాధికారి వెంకటయ్య పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. 212 మంది విద్యార్థులకు గాను 195 మంది పరీక్షకు హాజరయ్యారు.

భార్యాభర్తలపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు

పెనమలూరు: భార్యాభర్తపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప గ్రీన్‌సిటీ కాలనీకి చెందిన లావు మల్లేశ్వరి, ఆమె భర్త మాధవరావు ఆ కాలనీలో నివశిస్తున్నారు. అయితే మాధవరావు కాలనీ వాసులతో మాట్లాడుతున్న సమయంలో కాలనీ వాసి బొద్దులూరి వెంకటేశ్వరరావు వచ్చి అకారణంగా మాధవరావుతో గొడవపడి దౌర్జన్యం చేశాడు. ఇంతలో మాధవరావు భార్య మల్లేశ్వరి భర్తను తీసుకుని ఇంటికి వచ్చేసింది. వెంకటేశ్వరరావు వాకింగ్ చేసే సమయంలో మల్లేశ్వరిని ఉద్దేశిస్తూ నీ భర్త మాధవరావు ఎక్కడ ఉన్నాడని, అంతుచూస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు మల్లేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వైఎస్సార్ సీపీతోనే మహిళా సాధికారత


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్ రాణి

గన్నవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే మహిళా సాధికారత సాధ్యమని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. స్థానిక నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ మండల మహిళా విభాగం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. మహిళలకు స్థానిక సంస్థల ఎన్నికలు, నామినేటెడ్ పదవుల్లో 50 శాతం అవకాశాలను కల్పించిందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ విజయం కోసం మహిళా విభాగం సమన్వయంతో పని చేయాలని సూచించారు. పార్టీ జిల్లా నాయకులు సూరెడ్డి మణిమ్మ, కే అరుణకుమారి, కేసరపల్లి సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, పలువురు మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.

టీడీపీని నమ్మితే మునిగినట్టే

- అధిష్టానం సీటు ఇస్తుందని ఆశించిన స్మిత
- ఒప్పందం నిలబెట్టుకుంటారని ఆశించి భంగపాటు
- చలసాని కుటుంబానికి మళ్లీ మొండిచెయ్యి
- ఈ ఎన్నికల్లోనూ బోడెకు సీటు
- బెదిరింపులు, ఎన్ఆర్ఐల సపోర్టుతోనే దక్కిందంటూ చర్చ

కంకిపాడు: కుక్క తోక పట్టి గోదారి ఈదటం.. ఒప్పందం ప్రకారం టీడీపీ అధిష్టానం సీటు ఇస్తుందని నమ్మకం పెట్టుకోవడం.. రెండూ ఒక టేనని మరోమారు రుజువైందని స్మిత వర్గం మండిపడుతోంది. పార్టీని నమ్మితే నట్టేట మునిగినట్టేనని అధిష్టానం నిరూపించుకుందంటున్నారు. కష్టపడితేనో, నమ్ముకుని ఉంటేనో సీటు రాదని, డబ్బు సంచుల రాజకీయమే పెనమలూరులో చెల్లుతుందని తేల్చిందని వాపోతున్నారు. ఆ పార్టీ నియోజకవర్గ అభ్యర్థిగా బోడె ప్రసాద్‌ను ఖరారు చేయడంతో టీడీపీ అధిష్టానం డబ్బు రాజకీయాలు, నమ్మకద్రోహంపై పార్టీ వర్గాల్లో బాహాటంగానే విస్తృత చర్చ సాగుతోంది.

చలసాని కుటుంబానికి మళ్లీ మొండి చెయ్యి..

పెనమలూరు నియోజకవర్గ టీడీపీలో చలసాని వెంకటేశ్వరరావు(పండు)ది ప్రత్యేకస్థానం. 2009లో పెనమలూరు నుంచి పోటీచేసి కేవలం 177 ఓట్లతో ఓటమి పాలయ్యారు. టీడీపీ ఇన్‌చార్జిగా కొనసాగుతుండగానే దారుణహత్యకు గురయ్యారు. దీంతో ఆ కుటుంబానికి అండగా నిలుస్తామని పార్టీ అధిష్టానం హామీ ఇచ్చింది. తొలుత పండు సతీమణి పద్మావతికి 2014 ఎన్నికల్లో సీటు ఇస్తామని చెప్పి అనివార్య కారణాల వల్ల ఇవ్వలేకపోతున్నామని అధిష్టానం చెప్పింది. మరలా ఈ దఫా పండు కుమార్తె దేవినేని స్మిత గతంలో జరిగిన ఒప్పందాలతో సీటు తమకే వస్తుందని నమ్మి నియోజకవర్గంలో ప్రతి గడప తిరుగుతూ పార్టీ కార్యక్రమాలు ప్రచారం చేశారు. సీటుపై గట్టి నమ్మకం పెట్టుకున్నారు. కానీ ఈ దఫా కూడా వాళ్లకు రిక్తహస్తమే మిగిలింది. ఒప్పందాలను తుంగలో తొక్కి అధిష్టానం చేతులెత్తేసింది. న్యాయం జరుగుతుందని ఆశిస్తే నిరాశే మిగలడంతో భవిష్యత్తు కార్యాచరణకు పండు వర్గం సమాయత్తం అవుతోంది.

బెదిరింపులు, ఎన్ఆర్ఐల సపోర్టే కారణమా..?

నిన్నటివరకూ బోడె ప్రసాద్‌కు సీటు లేదని చెప్పిన అధిష్టానం చివరికి సీటు ఖరారు చేసింది. అధిష్టానం అన్యాయం చేసిందని, ప్రజలే న్యాయం చెప్పాలంటూ బోడె ప్రచారం చేశారు. రెండు రోజుల క్రితం మాట మార్చి, సీటు తనదేననే నమ్మకం వ్యక్తం చేశారు. దీని వెనుక డబ్బు మూటల రాజకీయం పని చేసిందనే వ్యాఖ్యలు బాహాటంగా వినిపిస్తున్నాయి. చంద్రబాబు, చినబాబుతో భేటీ అయిన కొందరు ఎన్ఆర్ఐలు పెనమలూరు సీటు బోడెకు ఇవ్వాలని ఎన్నికల వ్యయం బాధ్యత తమదంటూ ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది. 2014 ఎన్నికల్లో గెలుపొందిన నేపథ్యంలో ప్రయోజనం పొందిన కొందరు నేతలు, కాంట్రాక్టర్లు, బిల్డర్లు కూడా డబ్బు సంచులు సిద్ధం చేసి అధిష్టానం, ఎన్ఆర్ఐల వద్దకు చేర్చుతున్నారని బాహాటంగా చర్చ జరుగుతోంది. స్వతంత్రంగా పోటీ చేస్తానని బెదిరింపులు చేసినా పట్టించుకోకుండా చేసేది లేక అధిష్టానం ‘ఖర్చు’ దృష్టిలో పెట్టుకుని ఎన్ఆర్ఐలకు వత్తాసు పలికినట్లు తాజా పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. దొంగ పరీక్ష, ఇసుక, మట్టి అడ్డగోలుగా అమ్ముకున్నా, సెక్స్ రాకెట్, కాల్ మనీ కేసులు వంటివి ఎన్ని ఆరోపణలు ఉన్నా పట్టించుకోకుండా అధిష్టానం సీటు కేటాయించిందంటే అవే అర్హతలేమో? వర్గాలను కలుపుకొని వెళ్లలేకపోవడం కూడా అర్హతే అనుకుంటా? అధిష్టానం సీటు ఇవ్వడానికివే కారణాలేమో? అంటూ బోడె వ్యతిరేక వర్గాలు గుసగుసలాడుతున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ఇందిరానగర్-1, 2, వినోద్ పబ్లిక్ స్కూల్ రోడ్డు, మహాత్మాగాంధీ రోడ్, నేతాజీ రోడ్, చౌడేశ్వర కాలనీ, శ్రీకృష్ణ కాలనీ, రావి సుబ్బయ్య కాలనీ, కోడూరు కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

పోరంకి గ్రామంలో..

పోరంకి గ్రామంలో శనివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. పోరంకి ప్రాంతంలోని పెనమలూరు సెంటర్, రామాపురం కాలనీ, సాలిపేట, డొంక రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

గన్నవరం రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం పురుషోత్తపట్నం ఫీడర్ పరిధిలో శనివారం మధ్యాహ్నం 3.30 నుంచి ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల ఈఈ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లో శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం ప్రసాదంపాడులో ఆశ్రమం రోడ్డు, శాస్త్రి వీధి, ఆంధ్రాబ్యాంకు ఏరియా, ఎనికేపాడులో కొడాలివారి వీధి, డీమార్ట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు


జోగి రమేష్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన పెదపులిపాక టీడీపీ నేతలు


వైఎస్సార్ సీపీలో చేరిన తాడిగడప టీడీపీ నేతలు

పెనమలూరు: టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు జరిగాయి. గంగూరులోని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, పెనమలూరు అభ్యర్థి జోగి రమేష్ ఆధ్వర్యంలో పెదపులిపాక గ్రామానికి చెందిన 50 కుటుంబాల టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి సముచిత న్యాయం జరుగుతుందని మంత్రి అన్నారు. గ్రామ సర్పంచ్ గుంటూరు శ్రీనివాసాచౌదరి, నాయకులు పాల్గొన్నారు.

పెనమలూరు: వైఎస్సార్ సీపీలోకి శుక్రవారం తాడిగడపకు చెందిన టీడీపీ నేతలు చేరారు. గంగూరులో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంత్రి జోగి రమేష్ సమక్షంలో టీడీపీ నేతలు చేరగా వారిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కానూరు మాజీ సర్పంచ్ అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో షౌకత్‌ఆలీ, షేక్ నయీమ్‌బాషా, షేక్ అక్బర్‌బాషా, ఎస్‌కే అన్సారి, షేక్ అజీస్, షేక్ బాజీ, షేక్ సలీమ్ తదితరులు ఉన్నారు.

కానూరులో సెంట్రల్ టీమ్ సమీక్ష సమావేశం


కానూరు సిద్ధార్థ కాలేజీలో సమీక్ష నిర్వహిస్తున్న సెంట్రల్ టీమ్

పెనమలూరు: ప్రభుత్వ పాఠశాలలో అమలు జరుగుతున్న టెక్నాలజీపై సెంట్రల్ టీమ్ ప్రతినిధులు ఆశిష్ కుమార్ సక్సేనా, హరీష్‌చంద్ర సమీక్ష నిర్వహించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో డిపార్టుమెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ అధ్యక్షతన శుక్రవారం సమీక్ష సమావేశం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు, ఇంట్రాక్టీవ్ టచ్ ప్యానెల్స్, ఎనిమిది, తొమ్మిదో తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్స్ వినియోగంపై సమీక్షలో చర్చించారు. ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్, కాలేజీలో వివిధ విభాగాల అధిపతులతో సెంట్రల్ టీమ్ సభ్యులు, ప్రవీణ్‌ప్రకాష్ మాట్లాడారు. టీచర్లు నేర్చుకున్న టెక్నాలజీని విద్యార్థులకు ఎలా అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని అమలు చేస్తున్నందుకు ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్‌ను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.